క్లుప్తంగా

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం

కేతేపల్లి : ప్రభుత్వం అమలుచేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొండకిందిగూడెం సర్పంచ్ గోలి మంజుల వేణుమాధవరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని కొండకిందిగూడెం గ్రామంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉప సర్పంచ్ పి.ప్రభాకర్, క్యాంపు వైద్యాధికారి సుజిత్, మండల వైద్యాధికారి అర్చన, పంచాయతీ కార్యదర్శి బి.ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది ఎ.వీరబ్రహ్మాచారి, ఎ.సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణమాఫీ చేయాలి

నల్లగొండ టౌన్ : రైతులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీని ఏకకాలంలో చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు కేవలం రూ.37 వేల వరకు ఉన్న రుణాలు మాత్రమే ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. రుణమాఫీ అవుతుందని నాలుగేళ్లుగా రైతులు బ్యాంకుల పంట రుణాలను చెల్లించలేదన్నారు. దీంతో బ్యాంకులో రైతులు డిఫాల్టర్లుగా మిగిలిపోవడంతోపాటు వడ్డీ పెరిగిపోయి అప్పులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను డిఫాల్టర్లుగా చూపించి బ్యాంకు అధికారులు రుణాలు ఇవ్వడం లేదని అన్నారు.

ఎంజీయూలో ఇంగ్లిష్ గ్రామర్ బుక్ విడుదల



గ్రామర్ బుక్ విడుదలచేస్తున్న వీసీ

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : యూనివర్సిటీ ఆంగ్ల విభాగం అధ్యాపకుడు దండ రవీందర్‌రెడ్డి రాసిన ఇంగ్లిష్ గ్రామర్ బుక్ ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడుతుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. దండ రవీందర్‌రెడ్డి రచించిన ఇంగ్లిష్ గ్రామర్ అండ్ కమ్యూనికేషన్ బుక్‌ను మంగళవారం యూనివర్సిటీలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. పోటీ పరీక్షలతోపాటు కమ్యూనికేషన్ స్కిల్ నేర్చుకోవడానికి ఈ బుక్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణారావు, పుస్తక రచయిత దండ రవీందర్‌రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్స్‌పాల్ అరుణ ప్రియ, రవి, శ్యామ్‌సుందర్, అంజిరెడ్డి, మద్దిలేటి, శ్రీదేవి, నవీన్, ప్రవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన యూనివర్సిటీ సెక్యూరిటీ అధికారి గోలి పాపయ్యను వీసీ, అధ్యాపకులు సన్మానించారు.

పాఠశాల వార్షికోత్సవం

చండూరు : మున్సిపాలిటీ కేంద్రంలోని మరియానికేతన్ పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటక, ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


సట్టు యాదగిరికి సన్మానం



యాదగిరిని సన్మానిస్తున్న డీఎస్‌ఓ, సిబ్బంది

నల్లగొండ : డీఎస్‌ఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేటర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన సట్టు యాదగిరికి మంగళవారం కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరిని జిల్లా పౌర సరఫరాల అధికారి వి. వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణమూర్తి, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్.యాదగిరి, డీలర్ల సంఘం అధ్యక్షుడు పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ రామకృష్ణ

నకిరేకల్ : మాదక ద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని నకిరేకల్ ఎక్సైజ్ ఎస్‌ఐ రామకృష్ణ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డ్రగ్స్‌పై విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్, చంద్రశేఖర్, అధ్యాపకులు వి.శేఖర్, మధుసూదన్ రెడ్డి, హబీబ్, శంకర్, రాధిక నరసింహ, చారి, జానయ్య, సురేష్, కల్యాణి పాల్గొన్నారు.

పన్ను మినహాయింపు ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : రిటైర్డ్ ఉద్యోగులకు ఆదాయ పన్ను రూ.5లక్షల నుంచి రూ.8 లక్షల వరకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నల్లగొండ మండల అధ్యక్షుడు గజవెల్లి సత్యం, కార్యదర్శి యాదవాసుదేవ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

ఆహ్లాదకరంగా అమృత్ పార్క్



పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటుచేసిన ఆట వస్తువులు



పార్క్ మధ్యలో గ్రీనరీ, వివిధ రకాల బొమ్మలు

- రూ.65 లక్షల వ్యయంతో నిర్మాణం
- నేడు విద్యానగర్ పార్క్‌ను ప్రారంభించనున్న ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అమృత్ పార్క్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. పిల్లల, పెద్దలు కాసేపు ప్రశాంతంగా గడపడానికి పార్క్‌లో పచ్చదనం ఉండేలా చేసి వివిధ రకాల బొమ్మలను ఏర్పాటుచేశారు. రూ. 65 లక్షల వ్యయంతో పార్కులో సౌకర్యాలు కల్పించారు. పార్కులో చిన్నచిన్న మొక్కలు, గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, పార్కు చుట్టూ కంపౌండ్ ఏర్పాటుచేశారు. అదేవిధంగా రాత్రిపూట ఆడుకోవడానికి ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. పార్క్ ముందు సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించారు. ఈ పార్కును బుధవారం స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మున్సిపల్ కమిషనర్ రమణాచారి పార్క్‌ను పరిశీలించి ప్రారంభ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నల్లగొండ పట్టణంలోని విద్యానగర్ అమృత్ పార్క్



పార్క్‌లో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్



యోగా ముద్ర ఆకారంలో బెంచ్

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



గోపలాయపల్లిలో గ్రామ పంచాయితీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

నార్కట్‌పల్లి : నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోపలాయపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్డు, ముదిరాజ్ భవన నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ గోపలాయపల్లి గ్రామంలో ప్రజాప్రతినిధుల కృషి వల్ల రూ.కోటి 30 లక్షల వరకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోసుల భద్రాచలం, ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, ఉప సర్పంచ్ యాట సైదులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చ ముత్యాలు, వార్డు సభ్యులు నరేష్, గోవర్ధన్, పద్మ, గోపాల్, సుదర్శన్, గాలి నర్సింహ, ఆంజనేయులు, దేశగాని పెద్ద వెంకన్న, యాట గోపాల్, పరమేష్, వెంకన్న, స్వామి , గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యం

కేతేపల్లి : కేసీఆర్‌తోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని చీకటిగూడెం, ఇప్పలగూడెం, గుడివాడ గ్రామాల్లో సీసీరోడ్లు, గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాల నిర్మాణాలకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతిని సాధించిందని, అదే సంకల్పంతో దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీని స్థాపించినట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీని అడ్డుకునే శక్తి కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ పార్టీకే ఉందన్నారు. అంతకు ముందు ఇప్పలగూడెం గ్రామంలో ఉప సర్పంచ్ శేఖర్‌లోపాటు పలువురు వార్డు సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కేతేపల్లి జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, ఆయా గ్రామాల సర్పంచులు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, కోట వెంకటేశ్వరావు, కట్ట శ్రవణ్, డి.వీరయ్య, ఎంపీటీసీలు దాచేపల్లి నర్మద, ఎ.వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన జాల సోములు(50) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. సోములు మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఇరవై ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పర్నే నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మేడి రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి హామీ పనులు ప్రారంభం

మర్రిగూడ : మండలవ్యాప్తంగా నేటి నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పునః ప్రారంభిస్తున్నట్లు ఏపీఓ గుంటుక వెంకటేశం మంగళవారం తెలిపారు. మండలవ్యాప్తంగా 10,557 జాబ్‌కార్డులకు గాను 6,340 జాబ్‌కార్డు దారులకు పని కల్పించామని అన్నారు. 21,984 మంది ఉపాధి కూలీల్లో 10,948 మంది కూలీలు గత ఏప్రిల్ నుంచి జనవరి వరకు ఉపాధి పనులను చేశారని, దినసరి వేతనం రూ.257 చెల్లిస్తున్నట్లు తెలిపారు. వంద రోజుల పనిదినాలు పూర్తకానివారు గ్రామపంచాయతీ వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ పురుషోత్తం

కేతేపల్లి : యాసంగిలో సాగు చేసిన వరిలో అధికారులు చేసిన సిఫారసు మేరకు ఎరువులు వేయాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం సూచించారు. మండలంలోని గుడివాడ గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పొలాలను మంగళవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. పొలంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో అధిక చలి ప్రభావం వల్ల వరిలో సూక్ష్మధాతువుల లోపాలు పెరిగి, ఆకులు ఎర్రగా మారాయని తెలిపారు. ఆఖరి విడతలో నత్రజనితోపాటు పొటాష్ ఎరువును కలిపి వేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతిని గుర్తించామన్నారు. దీని నివారణకు 2గ్రాముల కార్టాప్ క్లోరైడ్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు తప్పక పాటించాలని అన్నారు. అదేవిధంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వీరేష్, రైతులు శ్రీను, సైదులు, సురేష్, కిరణ్, ఆసిఫ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు ఖర్చుచేయడంలో నిర్లక్ష్యం వహించొద్దు



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు : గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పనకు ప్రభుత్వం మంజూరుచేసిన నిధులు ఖర్చు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించొద్దని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉప ఎన్నిక సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 30 కోట్లకుపైగా నిధులు మంజూరు చేయించామన్నారు. రోడ్లు, విద్యుత్ మరమ్మతులకు, మురికి కాల్వల నిర్మాణానికి దాదాపు రూ. 150 కోట్లకుపైగా నిధుల మంజూరయ్యాయని తెలిపారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా 15 పాఠశాలలకు రూ. 15 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అతిత్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా 7400 మంది లబ్ధిదారులకు రూ.100 కోట్లతో లక్షా 40వేల గొర్రెలను ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కొనుగోలు చేయిస్తామన్నారు. అంతకుముందు అధికారులు తమ శాఖల నివేదికలు చదువుతుండగా.. కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు కొందరికే అద్దాలు ఇస్తున్నారని ఎల్లగూడెం సర్పంచ్ సురిగి చలపతి అన్నారు. మునుగోడు మండలవ్యాప్తంగా విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు నడుస్తున్నాయని ఎక్సైజ్ అధికారులు ముడుపులకు ఆశపడి బెల్టు దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవడంలేదని మునుగోడు సర్పంచ్ మిర్యాల వెంకన్న ఆరోపించారు. సంఘమిత్ర కార్యాలయం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు అందిస్తున్న రుణాల వివరాలు ప్రజాప్రతినిధులకు చెప్పడంలేదని మునుగోడు–1 ఎంపీటీసీ బొడ్డు శ్రావణి ఆరోపించారు. జమస్థాన్‌పల్లి గ్రామంలోని ప్రజలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని జమస్థాన్‌పల్లి సర్పంచ్ పంతంగి పద్మ అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జానయ్య, తహసీల్దార్ కృష్ణారెడ్డి, వైఎస్ ఎంపీపీ అనంత వీణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

'మన ఊరు-మన బడి' ప్రారంభానికి సిద్ధం



మరమ్మతులు పూర్తయిన తిప్పర్తి మండలంలోని కాశివారిగూడెం పాఠశాల

నల్లగొండ టూటౌన్ : మన ఊరు–మనబడి, మన బస్తీ–మన బడి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వీ.రమణాచారి తెలిపారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని పద్మనగర్‌లో మిర్యాల కమలమ్మ పాఠశాల, 11వ వార్డు కతాల్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాలకు ఇరువైపులా మొక్కలను త్వరగా నాటాలని, మైదానాన్ని ఇసుకతో నింపి విద్యార్థులు ఆడుకునే విధంగా తయారుచేయాలని సిబ్బందికి సూచించారు. మన బస్తీ–మన బడిలో భాగంగా పాఠశాలలను ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు కంకణాల లక్ష్మమ్మ, గుర్రం ధనలక్ష్మి, ఏసీపీ నాగిరెడ్డి, డీఈలు నరసింహారెడ్డి, వెంకన్న, ఏఈలు రవీందర్, ప్రవీణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజాఅలీ, శంకర్ తదితరులు ఉన్నారు.

నేడు పాఠశాలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

రామగిరి(నల్లగొండ) : మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా తిప్పర్తి మండలంలోని కాశివారిగూడెంలో రూ. 9.90 లక్షల నిధులతో మరమ్మతులు చేసిన ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. పాఠశాలలో విద్యుత్, ఫ్లోరింగ్‌తోపాటు పాఠశాల భవనానికి రంగులు వేశారు. నూతనంగా నీటి సంపు, వాష్ ఏరియా కట్టించారు. కిటికీలు, టాయిలెట్‌లకు మరమ్మతులు చేశారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో తిప్పర్తి మండలవ్యాప్తంగా 15 పాఠశాలలను గుర్తించారు. అందులో 10 ప్రాథమిక పాఠశాలలు, 3 హైస్కూళ్లు, 2 ప్రాథమిక ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

యాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కొండేటి మల్లయ్య

కట్టంగూర్ : నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి చేపట్టే హాథ్ సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే స్థలం ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు, రైతులకు ఒకేసారి రుణమాఫీ, ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని తెలిపారు. ఈ హామీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలో రెండు నెలలపాటు జరిగే యాత్రలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల, యూత్ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకొని అధిష్టానానికి పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుంకరబోయిన నర్సింహయాదవ్, బెల్లి సుధాకర్, ముక్కాముల శేఖర్, జానయ్య, బొడ్డుపల్లి సైదులు, మేడి విజయ్, మహేశ్వరం నాగేష్, మల్లెబోయిన యాదగిరి, గట్టిగొర్ల సత్తయ్య, ఏనుగు సైదులు, బొజ్జ శ్రీను, గోపి, కక్కిరేణి సైదులు, నంద్యాల అనంతరెడ్డి, అంతటి రామకృష్ణ, సంతోష్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, టీఆర్‌ఎస్‌కేవీ మిషన్ భగీరథ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్.ఆచారి డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు మంగళవారం పానగల్‌లోని మిషన్ భగీరథ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు చాలీచాలనీ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఈ నెల 6న చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. తమ సమస్య పరిష్కార మయ్యే వరకు ధర్నా కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో దండెంపల్లి సత్తయ్య, జంజిరాల శ్రీను, తిరుగుడు కృష్ణ, ఎండీ. జానీ, బత్తుల వెంకటేశం, నిమ్మగోటి శ్రీను, వి. లెనిన్, గట్టుపల్లి సంజీవరెడ్డి, సైదులు, మురళి, వెంకటేష్, ఎస్. సైదులు, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణ ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పూజారి శ్రీనివాసశర్మ

కట్టంగూర్ : మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారి శ్రీరామడుగు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పూర్ణాహుతి, హోమం, సువర్చల సహిత ఆంజనేయస్వామికి అభిషేకం, ఆకు పూజ, వడమాల ధారణ, మూలవిరాట్లకు అభిషేకం, విగ్రహాల ఊరేగింపు, ఎదుర్కోలు కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం జరుగునున్న కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ రెడ్డిపల్లి మనోహర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మీలా వేణుమాధవ్, కోమటి నర్సింహ, గుండు వెంకన్న, రెడ్డిపల్లి సైదులు, ఇల్లెందుల రామ్మూర్తి, రాపోలు వెంకటేశ్వర్లు, కడవేరు కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

వాగ్దానాలను సీఎం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంతయ్య

నల్లగొండ టౌన్ : ముఖ్యమంత్రి కేసీఆర్ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలను వెంటనే అమలుచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి శ్రవన్‌కుమార్, కార్యదర్శి బొల్గూరి కిరణ్‌కమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఎండీ జహంగీర్, జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఊషయ్య, వెంగళయ్య, వేముల యాదయ్య, దుబ్బ నర్సింహ, బొలుగూరి లింగయ్య, కొమరయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మర్రిగూడ : సీపీఐ బలోపేతానికి నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి తెలిపారు. మంగళవారం మర్రిగూడలో సీపీఐ సభ్యత్వాలను ఆయన అందజేసిన అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా మర్రిగూడ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామశాఖ కార్యదర్శిగా లపంగి రవితోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కేవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, ఎరుకుల యాదయ్య, ఆకుల రఘుమయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ అంటించిన వారిపై ఫిర్యాదు

నకిరేకల్ : భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గౌరవ ప్రతిష్టకు భంగం వాటిల్లేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ఆయన ఫొటోతో పోస్టర్లు అంటించినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నేత దైద రవీందర్ మంగళవారం స్థానిక ఎస్‌ఐ రంగారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన వెంట కేతేపల్లి ఎంపీపీ పేరుమాళ్ల శేఖర్, కాంగ్రెస్ వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య శ్రీనివాస్, దైద స్వప్న, నాయకులు కంపాసాటి శ్రీనివాస్, ముద్దం విజయ్, అంజన్, యూసఫ్, రాజశేఖర్‌గౌడ్, సాయి, పందిరి సతీష్ ఉన్నారు.



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గ్రాసం కోసం గోస పడుతున్న పశువులు



చందంపేట మండలం నుంచి లెంకలపల్లికి చేరుకున్న పశువుల మంద

మర్రిగూడ : మూగ జీవాలకు సరైన గ్రాసం దొరకక పశువుల పెంపకందారులు తమ పశువులను గ్రామ గ్రామానికి తిప్పుతున్నారు. సరైన గ్రాసం లేకపోవడంతో చందంపేట మండలం కంబాలపల్లి పరిధిలోని బండమీదితండాకు చెందిన ఆరుగురు వెయ్యికి పైగా తమ ఎద్దులు, ఆవులు, లేగ దూడలను మేపుకుంటూ మర్రిగూడ మండలంలోని లెంకలపల్లికి వారం రోజుల క్రితం చేరుకున్నారు. వేములపల్లి, మిర్యాలగూడ, మద్దిమడుగు, శ్రీశైలం తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లి సంవత్సరంలో రెండు లేదా మూడుమార్లు గ్రామానికి వెళ్తామని వారు తెలిపారు. మరో పది రోజుల పాటు ఇక్కడే మేపుకుంటామని, ఆసక్తిగల రైతులు తమకు తిండి గింజలు ఇస్తే వారి పొలాల వద్ద రాత్రి సమయంలో మందను ఉంచుతామని, తద్వారా పొలాలకు ఎరువు లభిస్తుందని తెలిపారు. గ్రాసం గోస తీరే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుందని వారు కోరుతున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

మర్రిగూడ : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని స్వాస్తవ క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చతుర్వేది అన్నారు. మంగళవారం మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో నోవర్టిస్ సహకారంతో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 87మందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం చతుర్వేది మాట్లాడుతూ 30 సంవత్సరాలకు పైబడిన మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోతే నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉంటుందన్నారు. యువకులు టొబాకో, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలన్నారు. కమిటీ సభ్యులు సరిత, ఏవీ.రమణ, వైద్యులు భావన, సింధు, రూప, మాలతి, తనూజ, సాహితి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా



నగదు అందజేస్తున్న పిల్లి రామరాజుయాదవ్

నల్లగొండ రూరల్ : పేదలకు అండగా ఉంటానని బీఆర్‌ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజుయాదవ్ అన్నారు. మంగళవారం కనగల్ మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన చిన్నపాక మరియమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని రామరాజు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబంలోని పిల్లలను తన ఫౌండేషన్ ద్వారా ఉన్నత విద్య చదివిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నరేందర్, లింగస్వామి, మహేష్, సైదులు, స్వాతి రాం, అరవింద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.